సాక్షి విజయనగరం

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



అగ్ని ప్రమాదంలో వృద్ధుడు సజీవదహనం

వేపాడ మండలం బొద్దాంలో శనివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ వృద్ధుడు కళ్లముందే సజీవదహనమయ్యాడు.

- 8లో



దారుణ హత్య!

పూసపాటిరేగ మండలం కొండగుడ్డి సమీపంలోని మామిడితోటలో వృద్ధురాలు మహంతి రాజమ్మ(64) దారుణ హత్యకు గురైంది.

- 8లో



25 వేల మందికి ఆరోగ్య తనిఖీలు

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో ఇప్పటి వరకు 25వేల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్టు డీఎంహెచ్‌వో ఐ.జగన్నాథరావు తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

కానిస్టేబుల్‌కు డీజీపీ డిస్క్ అవార్డు



డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కానిస్టేబుల్ భానోజీరావు

చీపురుపల్లి: చీపురుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామానికి చెందిన ఎం.భానోజీరావు డీజీపీ డిస్క్ అవార్డు దక్కించుకున్నారు. 2022–2023 సంవత్సరంలో జరిగిన చోరీ కేసులను ఛేదించడంలో చూపిన ప్రతిభకు అవార్డు వరించింది. విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో అవార్డును డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

జీఎంఆర్‌లో హ్యాక్‌థాన్ పోటీలు

రాజాం సిటీ: రాజాం జీఎంఆర్ ఐటీలో ఈ నెల 19, 20 తేదీల్లో స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ 2023 సాఫ్ట్‌వేర్ గ్రాండ్ ఫినాలే నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించనున్న హ్యాక్‌థాన్‌కు జీఎంఆర్ ఐటీ నోడల్ సెంటర్‌గా ఎంపికైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు రెండు రోజులపాటు నిరవధికంగా 36 గంటలపాటు జరుగుతాయన్నారు. ఆజాదీకా అమృత్‌మహోత్సవ్, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహించే సాఫ్ట్‌వేర్ గ్రాండ్ ఫినాలేకు 11 రాష్ట్రాల నుంచి 200 మంది విద్యార్థులు 27 బృందాలుగా పాల్గొంటారన్నారు. వీరిలో ఏఐసీటీఈ నుంచి ఇద్దరు నోడల్ ఆఫీసర్లు, 12 మంది న్యాయనిర్ణేతలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఏఐసీటీఈ ఇచ్చిన నాలుగు ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్స్‌లో పోటీ జరగనుందని, ప్రతి ఒక్కదానికి రూ.లక్ష చొప్పున బహుమతి ఇస్తారని పేర్కొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి

విజయనగరం ఫోర్ట్: మాతా శిశు మరణాల నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అక్టోబర్, నవంబర్ నెలలో జరిగిన మాతా శిశు మరణాలపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు సకాలంలో అన్ని సౌకర్యాలు ఉన్న ఆస్పత్రికి చేర్చడం ద్వారా మాతాశిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. హైరిస్క్ గర్భిణులను ముందుగా గుర్తించి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. బిడ్డకు పాలు ఇచ్చే విధానం, భంగిములు గూర్చి గర్భిణులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, నోడల్ ఆఫీసర్ పి.స్వాతి, డాక్టర్ శాంతి, డాక్టర్ సుధ, డీపీహెచ్ఎన్ఓ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజులోనే ధాన్యం బిల్లులు



ఆరుగాలం పొలంలో శ్రమించి పంటలు సాగుచేసే రైతన్నకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటోంది. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు ఊరిలో ఏర్పాటుచేసిన రైతుభరోసా కేంద్రాల ద్వారా సేవలందిస్తోంది. ఖరీఫ్ ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలకు 21 రోజుల్లో జమచేయాల్సిన బిల్లులను ఒక్కరోజులోనే జమచేస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వ తీరుపై ప్రశంసల జల్లుకురుస్తోంది.



డెంకాడ మండలం పెదతాడివాడలో నూర్పిడి చేస్తున్న రైతులు

- రైతుల్లో ఆనందహేల
- తొలి 10 రోజుల్లో రూ.34 కోట్లకు గాను రూ.26 కోట్ల చెల్లింపులు
- ముమ్మరంగా సాగుతున్న ధాన్యం కొనుగోలు, చెల్లింపులు
- రైతుల ఖాతాలకు మద్దతు ధర

విజయనగరం అర్బన్: ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపులలో ప్రభుత్వం చేపడుతున్న వినూత్నవిధానం రైతులకు మేలు చేస్తోంది. ధాన్యం కొనుగోలు చేసిన ఒక్క రోజులోనే రైతుల బ్యాంకు ఖాతాలకు క్వింటాకు ఎ–గ్రేడ్ రకం రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చొప్పున సొమ్ము జమవుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం చొరవతో రైతులకు ముందస్తుగా సంక్రాంతి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వరిసాగుపై కొంతమేరకు కరువు చాయలు పడినప్పటికీ పండిన చోట గణనీయంగా దిగుబడి వచ్చింది. గత నెల 23వ తేదీన ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినప్పటికీ మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వరికోతలు, నూర్పిడిలు పది రోజులపాటు నిలిచిపోయాయి. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు ఉండడంతో వరి నూర్పులు జిల్లా వ్యాప్తంగా చురుగ్గా సాగుతున్నాయి. దీంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది. ఒకటి రెండు మండలాలు మినహా దాదాపు అన్ని మండలాల్లో కొనుగోళ్లు చురుగ్గా సాగుతున్నాయి.

వెంటవెంటనే బిల్లుల చెల్లింపు

గడిచిన 10 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. దీని కోసం రూ.34 కోట్ల వరకు రైతులకు చెల్లించాల్సి ఉండగా, రూ.26 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో ఇప్పటికే జమయ్యాయి. నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమకావాల్సి ఉంది. అయితే, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం బిల్లులు చెల్లింపులు చేయాలన్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో ధాన్యం విక్రయించిన ఒకటిరెండు రోజుల్లోనే బిల్లుల చెల్లింపును అధికారులు పూర్తిచేస్తున్నారు. అత్యధికంగా మెరకముడిదాం మండల రైతులకు రూ.5.11 కోట్ల మేర చెల్లింపులు జరిగాయి. తరవాత రూ.4 కోట్లు దాటి చెల్లింపులు జరిగిన మండలాల్లో చీపురుపల్లి, రాజాం, రూ.3 కోట్లు దాటి చెల్లింపులు జరిగిన మండలాల్లో తెర్లాం, వంగర ఉన్నాయి.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

ఒకవైపు పంట నూర్పిళ్లు జోరుగా జరుగుతుండగా, మరో వైపు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఊపందుకుంది. రికార్డు స్థాయిలో పంట పండటంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పటిష్టంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రైతు కళ్లాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 510 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ప్రస్తుతం రెండు మండలాల మినహా అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లోనూ కొనుగోలు ప్రక్రియ జరుగుతుంది. ఎక్కడా మిల్లర్ల ప్రమేయం లేకుండా దళారీలకు తావివ్వకుండా అత్యంత పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ జరుగుతోంది. గోనె సంచుల సరఫరా నుంచి రవాణా ఏర్పాట్లను కూడా ప్రభుత్వమే నిర్వహిస్తోంది.

అమ్మిన వెంటనే...



నా పేరు తిరుమలరాజు కృష్ణభగవాన్‌రాజు. మాది డెంకాడ మండలంలోని చొల్లంగిపేట. నేను ధాన్యం నూర్పిడి చేసినట్టు మా గ్రామ ఆర్‌బీకే సిబ్బందికి తెలియజేశాను. వారు వెంటనే కళ్లంకు వచ్చారు. ధాన్యం నాణ్యతను పరిశీలించారు. గోనెలు ఇచ్చారు. దగ్గరుండి తూకం వేశారు. 44 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. పీజీఎస్ డివైజ్ ఉన్న వాహనంతో మిల్లుకు తీసుకెళ్లారు. మరుచటి రోజునే ధాన్యం సొమ్ముతోపాటు, రవాణా చార్జీలు కూడా బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఇలాంటి విధానం ఎన్నడూ చూడలేదు. దళారులకు గతంలో ధాన్యం విక్రయిస్తే.. డబ్బులకోసం నెలలతరబడి తిరగాల్సి వచ్చేది. అదికూడా మద్దతు ధర లభించేది కాదు. కష్టానికి తగిన ఫలితం అందజేస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు



రైతుల నుంచి మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోంది. ధాన్యం విక్రయించే రైతులందరూ ముందుగా ఆర్బీకే వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంప్రదించాలి. అక్కడి సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా ధాన్యం నాణ్యతను నిర్ణయించి టోకెన్ ఇస్తారు. జీపీఎస్ డివైజ్ ఇచ్చిన వాహనాలతో షెడ్యూల్ ప్రకారం ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తారు. టోకెన్ ఇచ్చిన రైతుకు అవసరమైన గన్నీలను ఆర్‌బీకే సిబ్బంది అందజేస్తారు. పూర్తి వివరాలను ఆర్‌బీకే లాగిన్‌లో అప్‌లోడ్‌చేసి మిల్లులకు పంపుతారు. మిల్లులో కస్టోడియన్ అధికారుల లాగిన్‌లో రవాణా చార్జీల నమోదు ఆటోమేటిక్‌గా జరుగుతుంది. వెంటనే సబంధిత బిల్లుల చెల్లింపునకు రంగం సిద్ధం అవుతుంది. ఎట్టి పరిస్థితిలోనూ దళారులు, మిల్లర్ల వద్దకు వెళ్లవద్దు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పటిష్టంగా, పారదర్శకంగా చేస్తున్నాం.

– కె.మీనాకుమారి, డీఎం, సివిల్ సప్లై సంస్థ



పెదతాడివాడలో ధాన్యం కొనుగోలుచేసిన ఆర్‌బీకే సిబ్బంది

పోలమాంబ జాతరకు పిలుపు

- రాష్ట్ర ఉత్సవంగా అమ్మవారి జాతర
- జనవరి 22, 23, 24 తేదీల్లో ఉత్సవాల నిర్వహణకు నిర్ణయం
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- అత్యవసర సేవలు తప్పనిసరి
- వివిధ శాఖలను ఆదేశించిన ఆర్డీఓ కె.హేమలత



పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ జాతరకు ముహూర్తం ఖరారైంది. జనవరి 22, 23, 24 తేదీల్లో అమ్మవారి పండగను నిర్వహించాలని ఉత్సవకమిటీ నిర్ణయించింది. ఈ మేరకు జాతర ఏర్పాట్లపై పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో శనివారం ఆర్డీఓ కె.హేమలత సమీక్షించారు. అమ్మవారి పండగను రాష్ట్ర పండగగా జరపాలని ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిపారు. అమ్మవారి సిరిమానోత్సవాన్ని వైభవంగా జరపాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులందరూ పూర్తి సంతృప్తితో తిరిగి వెళ్లాలని, దీనికోసం అధికారులంతా సమన్వయంతో కృషిచేయాలని సూచించారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారని, తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, కుళాయిలు, బోర్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు అవసరమైన మరుగుదొడ్లు సిద్ధం చేయాలని సూచించారు. గుడికి దగ్గరలో ఉండే గోముఖినది ప్రవాహాన్ని గమనిస్తూ ఉండాలన్నారు.

పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి

పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని, పార్వతీపురం, సాలూరు మున్సిపాల్టీల పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని అధికారులకు ఆర్డీఓ హేమలత సూచించారు. జాతర అనంతరం గ్రామాన్ని పరిశుభ్రం చేయాలన్నారు. అమ్మవారి మారుజాతర ముగిసే మార్చి నెలాఖరు వరకు ప్రతి మంగళవారం పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించాలన్నారు. పార్కింగ్ స్థలాలు, ప్రవేశ మార్గాల సమాచారం భక్తులకు తెలిసేలా బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. జాతరలో స్వచ్ఛంద సంస్థల సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. వైద్య శిబిరాల నిర్వహణతో పాటు అత్యవసర సమయంలో అంబులెన్సులు వెళ్లేందుకు మార్గం ఉండేలా ఏర్పాట్లు చేయాలని వైద్యశాఖాధికారులకు సూచించారు. సిరిమాను తిరిగే రోజున విద్యుత్ సరఫరా నిలుపుదలలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలని ఆమె ఆదేశించారు. వనం గుడి వద్ద తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయని, వాటిని మార్పుచేయాలని సూచించారు. జాతర సమయంలో అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచాలన్నారు.

జాతర షెడ్యూల్

మక్కువ మండలం శంబర గ్రామంలో ఈనెల 18న పెద్దమ్మవారి చాటింపుతో ప్రారంభమయ్యే పోలమాంబ ఉత్సవాలు 2024 మార్చి 26 తేదీన జరిగే చండీహోమం, మహా అన్నదానంతో ముగుస్తాయి. జనవరి 22న తొలేళ్ల ఉత్సవం, 23న సిరిమానోత్సవం, 24న అనుపోత్సవం నిర్వహిస్తారు. జనవరి 30వ తేదీ మంగళవారం నుంచి మార్చి 26వ తేదీ మంగళవారం వరకు మారుజాతర పది వారాలు జరుగుతాయని ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు తెలిపారు.

సమాచారమే ప్రధానం

జాతర సమాచారం ఎప్పటికప్పుడు భక్తులకు తెలిసేలా ప్రచారం చేసేందుకు అవసరమైన మైక్‌లు ఏర్పాటుచేయాలని ఆలయ సిబ్బందిని ఆర్డీఓ ఆదేశించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కొబ్బరికాయలు కొట్టే స్థలం, చెప్పులు విడిచి పెట్టే స్థలాలు భక్తులకు తెలిసేలా బోర్డులు ఏర్పాటుచేయాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ప్రసాదం తయారీలో పరిశుభ్రత పాటించాలని, ఎటువంటి కల్తీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.



అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

సినీతారల సందడి



ఐ లవ్ విజయనగరం....



విద్యలనగరంలో శనివారం జరిగిన ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో సినీతారలు తళుక్కుమన్నారు. సినీ నాయికలు పాయల్ రాజ్‌పుత్, నేహారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్‌మాల్‌లోని కొన్ని విభాగాలను ప్రారంభించారు. అనంతరం షాపింగ్‌మాల్ బయట ఏర్పాటుచేసిన వేదికపై సినీగీతాలకు స్టెప్పులు వేసి యువతను ఉత్సాహపరిచారు. ఐ లవ్ విజయనగరం అంటూ కేరింతలు కొట్టించారు. యువతతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. షాపింగ్‌మాల్ అధినేత గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, సరసమైన ధరలకే వస్త్రాలు లభిస్తాయని పేర్కొన్నారు.

– విజయనగరం రూరల్



ఎస్ఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరోయిన్‌లు

19 నుంచి రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు

- కరపత్రాలను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించతలపెట్టిన రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలను అందరి సమన్వయంతో విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో నిర్వహించనున్న కబడ్డీ పోటీల పోస్టర్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి శనివారం ఆవిష్కరించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు జరగనున్నాయి. స్థానిక మహిళా పార్కులో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోటీల తీరును సుబ్బారెడ్డికి శ్రావణి వివరించారు. విజేతలుగా నిలిచిన మొదటి నాలుగు జట్లకు రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తామన్నారు. మహిళా సాధికారతకు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి జన్మదిన కానుకగా రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించడం సముచితమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

క్లుప్తంగా

కొండగుడ్డి సమీపంలో హత్య!

- వృద్ధురాలిని హతమార్చిన ఆగంతకులు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు



సంఘటన స్థలంలోని రాజమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గోవిందరావు, సీఐ వెంకటేశ్వరరావు తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొండగుడ్డి సమీపంలోని మామిడితోటలో వృద్ధురాలు మహంతి రాజమ్మ(64) దారుణ హత్యకు గురైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. కొండగుడ్డి ప్రాంతానికి చెందిన రాజమ్మ శుక్రవారం మధ్యాహ్న సమయంలో కుమిలి నుంచి సీహెచ్ అగ్రహారం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి సమీపంలో ఉన్న మామిడితోటలోకి ఆవులను మేతకు తీసుకు వెళ్లింది. సాయంత్రం 6 గంటల వరకు రాజమ్మ ఆవులను తీసుకుని, ఇంటికి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం ఆమె కొడుకులు సమీప ప్రాంతాల్లో వెతికారు. మామిడితోటలో కత్తిపోట్లతో రక్తపుమడుగులో విగతజీవిగా పడిఉన్న రాజమ్మను చూసి, ఆమె కొడుకులు బోరున విలపించారు. మృతురాలు రాజమ్మకు నలుగురు కొడుకులు రాము, అప్పలనాయుడు, రాజినాయుడు, లక్ష్మనాయుడు ఉన్నారు. రాజమ్మది ముమ్మాటికీ హత్యేనని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఆమెపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, పరారయ్యారని పేర్కొన్నారు. రాజమ్మ హత్య విషయం తెలుసుకున్న విజయగనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ బాలకృష్ణ శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని, పరిశీలించారు. హత్య ఘటనపై ఆరాతీశారు. క్లూస్ టీమ్‌తో పలు ఆధారాలు సేకరించారు. బయట వ్యక్తులు హత్య చేశారా లేకపోతే స్థానికంగా ఉన్న వ్యక్తులే ఈ హత్యకు పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

సారా తయారీపై ఎస్‌ఈబీ ఉక్కుపాదం



సారా టబ్బులను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: సారా నిర్మూలనే ధ్యేయంగా సారా తయారీపై ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది ఉక్కుపాదం మోపారు. కొమరాడ మండలంలోని లంజి గ్రామ సమీపంలోని సారా తయారీ స్థావరాలపై ఎస్‌ఈబీ సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించి, 2,800 బెల్లంఊట, 20 లీటర్ల సారా, వంటసామగ్రి పట్టుకుని, ధ్వంసం చేశారు. ఇదే విషయమై శనివారం స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఈబీ సీఐ ఉపేంద్ర మాట్లాడుతూ ఎక్కడా సారా తయారీ అనేదే లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఆకస్మిక దాడులు ముమ్మరం చేసి, ప్రతీ చోటును పరిశీలిస్తున్నామన్నారు. సారా తయారీదారులు, విక్రేతలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఇదిలా ఉండగా, అగ్రహారం రైల్వే బ్రిడ్జి సమీపంలో పోలీస్ సిబ్బంది మాటువేసి, 200 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

47 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లతో పట్టుబడిన నిందితులు

సాలూరు: మండలంలోని దండిగాం జంక్షన్ వద్ద ఆటోలో తరలిస్తున్న 47 కిలోల గంజాయిని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్‌ఐ ప్రయోగమూర్తి శనివారం తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఒడిశాలో కొరాపుట్ జిల్లా, సార్లగుడకు చెందిన బనామలి పరజ, ఆయన సోదరుడు కమలోచన గంజాయి సాగు చేస్తున్నారు. ఈ గంజాయి రవాణాకు సహకరిస్తే ఒక్కొక్కరికీ రూ.5 వేలు ఇస్తామని తెలుపగా, అదే గ్రామానికి చెందిన హరిశ్చంద కరిల, గురు పరజాల అంగీకరించారు. ఈ మేరకు వారంతా ఒడిశాలోని సిమిలిగుడ నుంచి బొబ్బిలి జంక్షన్‌కు ఆటోలో గంజాయి తరలిస్తుండగా దండిగాం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులకు పట్టుబడ్డారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

అగ్నిప్రమాదంలో.. వృద్ధుడు సజీవదహనం

- వేపాడ మండలం బొద్దాంలో ఘటన
- కళ్లముందే జరిగిన ప్రమాదం
- విలపిస్తున్న కుటుంబ సభ్యులు



సిమ్మ నాగమయ్య (ఫైల్)



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పూరిపాక, మంచంపైనే సజీవదహనమైన వృద్ధుడు నాగమయ్య

వేపాడ: విజయనగరం జిల్లా వేపాడ మండలం బొద్దాంలో శనివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ వృద్ధుడు కళ్లముందే సజీవ దహనమయ్యాడు. మంటలు అదుపుచేసేలోగా నష్టం జరిగిపోయింది. కళ్లముందే వృద్ధుడు కాలిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్థానికులు, వేపాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్.కోట మండలం చందులూరు గ్రామానికి చెందిన సిమ్మ నాగమయ్య(72) వృద్ధాప్యం కారణంగా బొద్దాంలో నివసిస్తున్న చిన్నకుమార్తె సూరమ్మ ఇంటి వద్ద ఆశ్రయం పొందుతున్నాడు. చలిగా ఉందని తండ్రి చెప్పడంతో నిప్పుల కుంపటిని మంచం వద్ద పెట్టింది. అందులోకి దుప్పటి జారి పడడంతో మంటలు రాజుకుని పూరిపాకను అంటుకున్నాయి. కుమార్తెతో పాటు స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నాగమయ్య మంచంపైనుంచి లేవలేక పడుకున్నట్టుగానే సజీవదహనమయ్యాడు. మృతునికి ముగ్గురు ఆడపిల్లలతో పాటు భార్య ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ పోటీలకు రామభద్రపురం విద్యార్థులు



వజ్రపు పవన్‌కుమార్



గుర్ల: విద్యార్థి మురళిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు గౌరీదేవి, పీఈటీ లక్ష్మణ్



రామభద్రపురం: జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



శృంగవరపుకోట: విద్యార్థి సత్యనారాయణతో ఉపాధ్యాయులు

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్‌లో భాగంగా నరసారావుపేటలో ఇటీవల చేపట్టిన అథ్లెటిక్స్ పోటీల్లో రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు డి.శ్రీదేవి, బి.వెంకటరావు శనివారం తెలిపారు. అండర్–17 విభాగంలో పొట్టంగి పవన్‌కల్యాణ్ ట్రిపుల్ జంప్ పోటీలో, అండర్–19 విభాగంలో బొర్రా పార్థు పోల్ వాల్టుల్ క్రీడాపోటీలో ద్వితీయ స్థానాల్లో నిలిచి, ప్రతిభ కనబరచడంతో వారు జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. సదరు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.నాగభూషణరావు, ఎం.మురళీధర్, కె.దాలినాయుడు అభినందించారు.

త్రోబాల్ పోటీలకు చింతలపేట విద్యార్థి..

గుర్ల: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు చింతలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కరిమజ్జి మురళి ఎంపికైనట్లు పీఈటీ కె.లక్ష్మణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 11, 12వ తేదీల్లో నంద్యాలలో జరిగిన అండర్–17 రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సదరు విద్యార్థి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

సౌత్‌జోన్ పోటీలకు పవన్‌కుమార్..

విజయనగరం: ఇంటర్ వర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన విజయనగరం క్రీడాకారుడు వజ్రపు పవన్‌కుమార్ త్వరలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఇటీవల రాజాంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న పవన్‌కుమార్ ఉత్కృత్తమ ఆటతీరుతో విజేతగా నిలిచి, సౌత్‌జోన్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 19వ తేదీ నుంచి చెన్నైలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ తరఫున పవన్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ మేరకు అతడిని విజయనగరం సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, కార్యదర్శి ఎన్.సురేష్, వై.కుమార్ అభినందించారు. సౌత్‌జోన్ పోటీల్లో మెరుగైన ఆటతీరుతో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

ధర్మవరం నుంచి సత్యనారాయణ..

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి పట్నాన సత్యనారాయణ జాతీయ స్థాయి పరుగుల పోటీకి ఎంపికైనట్లు పాఠశాల పీడీ పి.శ్రీరాములు శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇటీవల నిర్వహించిన అండర్–19 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 4,100 పరుగు పందెంలో అతడు విశేష ప్రతిభ కనబరిచి, బంగారు పతకం సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రంలోని నాగపూర్‌లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మన రాష్ట్రం తరఫున సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తారు.

అథ్లెటిక్స్‌లో సత్తా..

సాలూరు: విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీలో గత రెండు రోజుల పాటు జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. ఎం.హరీష్ 5, 10 కిలోమీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం సాధించగా, ఏకాంబరం 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో బ్రాంజ్ మెడల్, వేలంగిణి షార్ట్‌పుట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు.

మాట నిలబెట్టుకున్నారు..

- వంశధార నిర్వాసితులకు పరిహారం చెల్లింపు
- ముఖ్యమంత్రి తీరుపై ప్రశంసలు



భామిని: వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించడం .. వారి ఖాతాలకు లక్షలాది రూపాయలు పరిహారం జమచేయించడంతో నిర్వాసితులు సంతోషపడుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పాలకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అంటూ కొనియాడుతున్నారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితులకు గత ప్రభుత్వం నామమాత్రపు పరిహారం చెల్లించిందని ప్రజాసంకల్పయాత్రగా వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక రైతులు వివరించారు. తమ గోడు వినిపించారు. ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే ఎకరానికి రూ.లక్ష చొప్పున అదనంగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు చెల్లింపులు పూర్తిచేశారు. అయితే... సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు ఈ పరిహారం అందలేదు. పలాసలో కిడ్నీ రీసెర్చ్‌సెంటర్ ప్రారంభానికి వచ్చిన సమయంలో పలువురు రైతులు ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై ఆయన వెంటనే స్పందిస్తూ పరిష్కారం చెల్లింపునకు ఆదేశించారు. దీంతో భామిని మండలంలోని కాట్రగడ–బి, నేరడి–బి, బిల్లుమడ, నులకజోడు, సింగిడి, భామిని, లివిరి, దిమ్మిడిజోల, బాలేరు గ్రామాలకు చెందిన రైతుల ఖాతాల్లోకి లక్షలాది రూపాయలు జమయ్యాయి. కాట్రగడ–బి గ్రామంలోని 8 మంది రైతుల ఖాతాలకు ఏకంగా 22 లక్షలు జమకావడంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

పరిహారం అందింది



వంశధార ప్రాజెక్టులో భూములు కోల్పోయి నామమాత్రపు పరిహారం చెల్లించి గత ప్రభుత్వం చేయి దులుపుకుంది. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ఎకరానికి అదనంగా రూ.లక్ష చొప్పున అదనపు పరిహారం ఇచ్చి ఆదుకున్నారు. నేరుగా బ్యాంకు ఖాతాలోకి చేరాయి. రైతు కష్టాలు తెలిసిన జగనన్న మేలును మరువలేము.

– పాండవ గౌడో, నిర్వాసిత రైతు, కాట్రగడ–బి, భామిని మండలం

ఆదుకున్నారు



వంశధార నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ.లక్ష చొప్పున అదనపు పరిహారం అందజేసి ఆదుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పడని మరోసారి రుజువు చేశారు. సమస్య విన్న వెంటనే సాంకేతిక కారణాలతో నిలిచిన అదనపు పరిహారాలను చెల్లించి ఆదుకున్నారు.

– తోట లాల్, నిర్వాసిత రైతు, కాట్రగడ–బి, భామిని మండలం

యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

- కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సోమవారం నుంచి యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఇదే విషయమై ఐసీడీఎస్ పీవోలు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులతో శనివారం వెబినార్ ద్వారా సమావేశమైన ఆమె పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉన్న కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు అందజేసే సేవల్లో ఎటువంటి ఆటంకం కలగకుండా కేంద్రాలు తెరిచి, వాటిని నిర్వహించాలని తెలిపారు. క్రమం తప్పకుండా పక్కాగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందివ్వాల్సిన పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఇప్పటికే కేంద్రాల నిర్వహణను సచివాలయ సిబ్బందికి అప్పగించడం జరిగిందని, 80 శాతం వరకు కేంద్రాలను సచివాలయ సిబ్బంది తీసుకున్నారని, మిగిలినవి కూడా తీసుకుని సోమవారం నుంచి పూర్తిస్థాయిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీలతో మంత్రుల బృందం చేసిన చర్చలు విఫలమయ్యాయని, ప్రభుత్వం మరికొంత సమయం కోరిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా అర్హులకు మేలు జరిగేలా అంగన్‌వాడీ కేంద్రాలను నడపాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు, పిల్లల తల్లుల సహకారం తీసుకుని, సమీప పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి, అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి, లబ్ధిదారులకు వడ్డించాలన్నారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని, అయితే అంగన్‌వాడీ కేంద్రాలు అనేవి ప్రభుత్వ కార్యాలయాలని, వాటిని నిర్వహించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. ఈ విషయమై ఎస్పీతో మాట్లాడానన్నారు. ఇప్పటికే 98 శాతం టీహెచ్‌ఆర్ పంపిణీ జరిగిందని మిగిలినది సోమవారం జరగాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను వేరేగా నిర్వహించాలని, తిరిగి అప్పజెప్పేటప్పుడు స్టాక్‌ను సక్రమంగా అప్పగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని స్టాక్స్‌ను వీడియో చేసి, ఉంచాలని, ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కేంద్రాలను తెరిచి ఉంచాలన్నారు. ఎంపీడీవోలు, ఐసీడీఎస్ పీవోలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని, సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. కేంద్రాల వారీగా మ్యాపింగ్ జరగాలని, ప్రతిరోజూ స్టాక్‌పై సాయంత్రం నివేదిక అందించాలన్నారు. ప్రతిరోజూ కేంద్రాలను సందర్శించి, కార్యకలాపాలను పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో రాజ్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూ జిల్లా కో–ఆర్డినేటర్ నిర్మలాదేవి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, డీఈవో బి.లింగేశ్వరరెడ్డి, మెప్మా పీడీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి విజయ కో–ఆపరేటివ్ సొసైటీ చెల్లింపులు

విజయనగరం అర్బన్: నగరంలోని ది విజయ కో–ఆపరేటివ్ సొసైటీలో డిపాజిట్లు చేసిన వారికి డిపాజిట్‌ల చెల్లింపులు చేయడం జరుగుతుందని సొసైటీ లిక్విడేటర్ బి.మురళీధరరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని సబ్ డివిజనల్ సహకార అధికారి (ఫూల్‌బాగ్ కాలనీ గేట్) కార్యాలయంలో చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు చెల్లింపులు చేస్తామన్నారు.

సెంట్రింగ్ పనులకు వచ్చి, మృత్యువాత



మృతి చెందిన గోవర్ధన్ బౌరి

సాలూరు: మండలంలోని కుడుమూరు జంక్షన్‌లో గ్రీన్‌ఫీల్డ్ హైవే సెంట్రింగ్ పనులకు వచ్చిన జార్ఖండ్ వాసి గోవర్ధన్ బౌరి(53) పాముకాటుకు గురై, మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పాచిపెంట ఎస్‌ఐ నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జార్ఖండ్ రాష్ట్రంలోని దన్బాద్ జిల్లా, బ్రహ్మందిహ గ్రామానికి చెందిన గోవర్ధన్ బౌరి సెంట్రింగ్ పనుల అనంతరం శుక్రవారం రాత్రి బహిర్భూమి కోసమని ఆరుబయటకు వెళ్లాడు. అక్కడ అతడిని పాము కాటు వేయగా, వైద్య సేవల నిమిత్తం పాచిపెంట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

25 వేల మందికి ఆరోగ్య తనిఖీలు

- డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు



వైద్యసేవలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్‌వో జగన్నాథరావు

కొమరాడ: మండలంలోని సివిని గ్రామంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజలకు ఆరోగ్య తనిఖీలు చేయడం జరుగుతోందన్నారు. నవంబరు 15వ తేదీ నుంచి ఆరంభమైన ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 180 వైద్య శిబిరాలు చేపట్టి, 25,471 మందికి ఆరోగ్య తనిఖీలు చేయడం జరిగిందన్నారు. వీరిలో 2,483 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయగా 451 మందిని రిఫర్ చేయడం జరిగిందని, 719 మందికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేయగా, ఐదుగురిని రిఫర్ చేయడం జరిగిందన్నారు. 7,025 మందికి పీఎం జనారోగ్య యోజన కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో రోజుకు 8 వైద్య శిబిరాలు చొప్పున నాలుగు మండలాల్లో నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు గ్రామంలో చేపట్టిన వైద్య శిబిరంలో ఎంతమందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు.. ఎవరైనా క్షయ, సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న వారు ఉన్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.శిరీష, సర్పంచ్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.